
సాక్షి
బాపట్ల
సోమవారం । 19 । మే । 2025



పోలీసుల తనిఖీలు

వినుకొండ: పట్టణంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో ఆదివారం డాగ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. టౌన్ సీఐ శోభన్‌బాబు, ఎస్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 512.70 అడుగుల వద్ద ఉంది. ఇది 136.3003 టీఎంసీలకు సమానం.



లక్ష మల్లెలతో శ్రీవారి పూజ

నరసరావుపేట ఈస్ట్: మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని వేంకటేశ్వరస్వామికి ఆదివారం లక్ష మల్లెల పూజ నిర్వహించారు. మూలవిరాట్‌కు ఉదయం అభిషేకాలు, పూజలు జరిపారు.

న్యూస్‌రీల్

మహా కుంభాభిషేకానికి వచ్చిన 'మేనక'



అద్దంకి: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో మహాకుంభాభిషేక కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఫారెస్ట్ అధికారుల ఆధీనంలోని మేనక అనే పేరు కలిగిన ఏనుగును ఆదివారం క్షేత్రానికి తీసుకుని వచ్చినట్లు ఫారెస్ట్ బీట్ అధికారి రమేశ్ తెలిపారు. కుంభాభిషేక కార్యక్రమంలో ఏనుగు పాత్ర ముగియగానే మరలా తీసుకుని వెళతామని చెప్పారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

చీరాల: జిల్లాలో పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈనెల 28వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. చీరాల నియోజకవర్గంలో ఎన్‌ఆర్‌పీఎం హైస్కూల్, కేజీఎం గరల్స్ హైస్కూల్, ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్, వేటపాలెం మండలంలో కొత్తపేట జెడ్పీ హైస్కూల్, వేటపాలెంలోని జెడ్పీ గరల్స్ హైస్కూల్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలను కూడా ఐదు సెంటర్లల్లో నిర్వహిస్తారు. మొత్తం 900 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు.

సజావుగా జేఈఈ అడ్వాన్స్‌డ్



గుంటూరు ఎడ్యుకేషన్: ఐఐటీల్లో ప్రవేశానికి ఆదివారం జేఈఈ అడ్వాన్స్‌డ్–2025 ఆన్‌లైన్ పరీక్షలు సజావుగా జరిగాయి. గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఏడు పరీక్ష కేంద్రాల తోపాటు నరసరావుపేటలోని ఒక పరీక్ష కేంద్రం పరిధిలో ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పేపర్–1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగిన పేపర్–2 పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష సమయానికి రెండు గంటల ముందు నుంచి తల్లిదండ్రులు విద్యార్థులను వెంట పెట్టుకుని కేంద్రాలకు వచ్చారు. ఎన్‌టీఏ విధించిన నిబంధనల ప్రకారం విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాత పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు.

జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా తుషార్ డూడీ



నగరంపాలెం: గుంటూరు జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా తుషార్ డూడీ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. బాపట్ల జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుత జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలసి వారం రోజులు సెలవుపై స్వస్థలం తమిళనాడు వెళ్లారు. ఈనెల 25న తిరిగి విధుల్లో చేరనున్నారని జిల్లా పోలీస్ కార్యాలయ వర్గాలు ఆదివారం పేర్కొన్నాయి. అయితే, గతంలో గుంటూరు జిల్లా ఎస్పీగా తుషార్ డూడీ విధులు నిర్వర్తించిన విషయం తెలిసిందే.

ఇద్దరి మధ్య ఘర్షణ.. వ్యక్తి మృతి

పమిడిపాడులో ఘటన

నరసరావుపేట రూరల్: స్వల్ప వివాదం నేపథ్యంలో ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని పమిడిపాడులో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఫిరంగుల కోటేశ్వరరావు(40), కోట్ల అంజిలు ఎదురెదురు ఇళ్లలో నివసిస్తున్నారు. అంజికి చెందిన గొర్రెల కారణంగా తమ ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని కోటేశ్వరరావు పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఇదే విషయంపై ఆదివారం పోలేరమ్మ ఆలయం వద్ద ఇద్దరి మధ్యా వాగ్వివాదం జరిగింది. దీనిపై పెద్దల వద్ద మాట్లాడుకుందామని ఇద్దరు బయలుదేరారు. ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో వీరిమధ్య మాటామాట పెరిగింది. ఈ క్రమంలో కోటేశ్వరరావు నెట్టడంతో అంజి పక్కకు పడిపోయాడు. కిందపడిపోయిన అంజి సమీపంలోని కర్రను తీసుకుని కోటేశ్వరరావు తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ సీఐ పి.రామకృష్ణ, ఎస్‌ఐ కిశోర్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

కాదేది కల్తీలకు అనర్హం

- ఆహారంలో విచ్చలవిడిగా రంగుల వాడకం
- జీర్ణకోశ వ్యాధులకు గురయ్యే అవకాశం
- రెస్టారెంట్లలో రోజుల తరబడి ఫ్రిజ్‌ల్లో ఆహారం నిల్వ
- పప్పు దినుసుల్లో నాణ్యత డొల్ల
- ఫుడ్ కంట్రోలర్ల దాడుల్లో బయటపడుతున్న వాస్తవాలు



పప్పు దినుసుల్లో కల్తీ

చీరాల అర్బన్: పాలు కల్తీ.. నూనె కల్తీ.. పప్పు దినుసులు కల్తీ.. ఎటు చూసినా విషాహారం.. ఏ హోటల్‌లో తిందామన్నా విచ్చలవిడిగా రంగులు వాడిన పదార్థాలు దర్శనమిస్తున్నాయి. విషతుల్యమైన మాంసం, చేపలు, రొయ్యలు, మరగబెట్టి మళ్లీవాడే నూనెలు, పాడైపోయిన దినుసులు వాడుతూ తయారు చేసిన ఆహారాన్ని అధిక ధరలకు అమ్మేస్తున్నారు. విషాహారంతో అమాయక ప్రజలను వ్యాపారులు ఆస్పత్రులకు పంపుతున్నారు. చీరాల పట్టణంలో ఆహార పదార్థాల్లో కల్తీ పెరిగినా అధికారులు, పాలకులు కన్నెత్తి చూడటం లేదు.

రంగుల గరళం

ముఖ్యంగా చిన్నారులను టార్గెట్ చేస్తున్న వ్యాపారులు పలు పదార్థాల్లో ప్రమాదకరమైన రసాయనాలతో ఉన్న రంగులు కలుపుతూ అంటగడుతున్నారు. వీటిని తింటే జీర్ణకోశ వ్యాధులు, క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు చేస్తున్నా వ్యాపారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. చీరాల నియోజకవర్గంలో బహుళ అంతస్తుల్లో నిర్వహిస్తున్న వెజ్, నాన్‌వెజ్ రెస్టారెంట్లు 15 ఉన్నాయి. పలావు పాయింట్లు, చికెన్ పకోడి, బిర్యాని పాయింట్లు, జాతీయ రహదారి వెంబడి నిర్వహించే షాపులు సుమారు వంద వరకు ఉన్నాయి. చీరాల, వేటపాలెం మండలాల్లో చిన్న చిన్న షాపులు, తోపుడు బండ్లపై పెట్టిన బిర్యానీ పాయింట్లు 50 వరకు ఉన్నాయి. పట్టణాలతో పాటు గ్రామాల్లో కూడా బిర్యానీ పాయింట్లు వెలిసి ప్రజారోగ్యానికి హానికరంగా మారాయి.

ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ తప్పనిసరి

హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు తప్పనిసరిగా ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి లైసెన్స్‌లు తీసుకోవాల్సి ఉంటుంది. ఆ శాఖ నిబంధనలు మేరకు ఆహారం తయారు చేయాలి. 2006లో ఈ చట్టం అమల్లోకి వచ్చింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఒంగోలుకు ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్, చీరాల, బాపట్లకు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. వీరంతా ప్రతి నెలా 12 శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపించాల్సి ఉంటుంది. ఆ నివేదికల ఆధారంగానే కేసులు నమోదు చేసి జరిమానా, శిక్షలు విధిస్తారు.

అనుమతులు తప్పనిసరి

ఆహారానికి సంబంధించిన వ్యాపారం చేయాలంటే తప్పనిసరిగా ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి అనుమతి తీసుకోవాలి. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించిన కార్యాలయం ఒంగోలులో ఉంది. లైసెన్స్ కోసం ప్రభుత్వానికి నిర్ణీత రుసుం చెల్లిస్తే అధికారులు పరిశీలించి జారీ చేస్తారు. అయితే, చాలా వరకు లైసెన్స్‌లు లేకుండానే వ్యాపారాలు సాగిస్తున్నట్లు సమాచారం.

దాడుల్లో బట్టబయలు



ఆయిల్‌లో కల్తీని పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి

- పట్టణంలోని రెస్టారెంట్లలో ఇటీవల ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో ఫ్రిజ్‌లో రోజుల తరబడి నిల్వ ఉంచిన చికెన్, రొయ్యలు, అల్లం.. వెల్లుల్లి పేస్ట్ వంటివి గమనించి నిర్వాహకులకు నోటీసులు అందించారు. నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు.
- చీరాల పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో ఉన్న బిర్యానీ సెంటర్లలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీ చేశారు. ఆహార లైసెన్స్‌లు లేకుండా నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కిచెన్ అపరిశుభ్రంగా ఉంచడం, టేస్టింగ్ సాల్ట్, ఫుడ్ కలర్లను విచ్చలవిడిగా వాడుతుండటంతో చర్యలు తప్పవని హెచ్చరించారు.
- చీరాల పట్టణంలోని హోటల్స్ ఇటీవల ఫుడ్ అసిస్టెంట్ కంట్రోలర్ తనిఖీ చేపట్టారు. అపరిశుభ్రతతో పాటు పప్పు దినుసులు కొన్ని కల్తీవిగా గుర్తించి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించారు.

విష రసాయన రంగుల వినియోగం

ఉమ్మడి ప్రకాశం జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారులు తరచూ నిర్వహించే తనిఖీల్లో కఠోర వాస్తవాలు బయటపడుతున్నాయి. ఎంతో అందంగా అలంకరించిన రెస్టారెంట్లలోనూ ఆహారం నాణ్యతగా ఉండటం లేదు. చీరాలలో ఇటీవల పలు బిర్యాని పాయింట్లను పరిశీలించగా ఫ్రిజ్‌ల్లో నిల్వ ఉంచిన చేపలు, రొయ్యలు, చికెన్, మసాల దినుసులు, అల్లం వెల్లుల్లి పేస్ట్, పుదీనా చట్నీలు దర్శనమిచ్చాయి. అయితే, వీటిలో కలిపేందుకు వినియోగించే రంగుల డబ్బాలు, టేస్టింగ్ సాల్ట్ ప్యాకెట్లు చూసి విస్తుపోయారు. కిచెన్ అపరిశుభ్రంగా ఉండడం, వాడిన నూనెనే తిరిగి వాడటాన్ని గుర్తించి నిర్వాహకులకు నోటీసులు అందించారు. బస్టాండ్ వద్ద ఉన్న స్వీట్స్ కార్ఖానాను పరిశీలించారు. అపరిశుభ్రత, పప్పు దినుసులు కల్తీగా ఉన్నట్లుగా గుర్తించి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించారు. ఫుడ్ కలర్‌ను పరిమితికి మించి వాడుతున్నారు. ఒక కిలోకు 0.001 మిల్లీ గ్రాములు వాడాల్సి ఉన్నా.. దీనికి ఎన్నో రెట్లు అదనంగా వినియోగిస్తున్నారు.

ఫుడ్ కలర్ ఎక్కువగా వాడితే ప్రమాదం



నిత్యం తినే ఆహారంలో ఫుడ్ కలర్ ఎక్కువగా వాడుతున్నారు. దీనివల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన మాంసాహారం వడ్డిస్తున్నారు. తనిఖీలు నిర్వహించి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపిస్తున్నాం. నివేదికలు వచ్చిన తర్వాత వారిపై చర్యలు తీసుకుంటాం.

–జి.ప్రభాకరావు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

కల్యాణ వైభోగమే !



స్వామి కల్యాణ మహోత్సవం

తెనాలిటౌన్: శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, వైకుంఠపురంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఏడురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజైన ఆదివారం ఉదయం 9 గంటలకు నిత్య హోమం, ఆలయ బలిహరణ, ఎదురుకోలోత్సవం వంటి కార్యక్రమాలను దేవస్థాన అర్చకులు నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో వైకుంఠవాసుని కల్యాణాన్ని కనులారా వీక్షించారు. కల్యాణ మహోత్సవానికి శ్రీ పద్మశాలీయ బహూత్తమ సంఘం సభ్యులు స్థానిక షరాఫ్‌బజార్‌లోని శ్రీ భావనా ఋషి దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలు తీసుకుని వేడుకగా తరలివచ్చి, వైకుంఠపురంలో స్వామివారికి సమర్పించారు. ముత్తయిదువులు, పద్మశాలీయ సంఘీయులు వేడుకలో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్, ఆలయ ఈఓ మంతెన అనుపమ పర్యవేక్షించారు. కల్యాణ మహోత్సవంలో డబుల్‌హార్స్ మినపగుళ్ల అధినేత మునగాల శ్యామ్‌ప్రసాద్, పలువురు పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న పద్మశాలీయ బహూత్తమ సంఘం నేతలు

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో నేడు మహా కుంభాభిషేకం



రాతి ముఖ మండపం (ఇన్‌సెట్)లో శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి వారి మూలవిరాట్

- శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విధుశేఖర భారతీస్వామి రాక
- 50 వేలకు పైగా భక్తులు వస్తారని అంచనా

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి నూతన రాతి దేవస్థానంలో మహా కుంభాభిషేకాన్ని సోమవారం ఉదయం 8 గంటలకు శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విధుశేఖర భారతీస్వామి నిర్వహించనున్నారు.

వైభవంగా కలశ యాత్ర

మహా కుంభాభిషేకంలో భాగంగా దేశంలోని పవిత్ర నదుల నుంచి సేకరించి తెచ్చిన పవిత్ర జలాలకు తోడుగా అద్దంకిలో జీవ నది అయిన గుండ్లకమ్మ నుంచి సోమవారం ఉదయం ఐదు గంటలకు 1008 కలశాలలో 1008 మంది పుణ్య స్త్రీలు జలాలను సేకరిస్తారు. నది పరీవాహక ప్రదేశం నుంచి శింగరకొండ క్షేత్రం వరకు ఆరు కిలోమీటర్ల పాదయాత్రతో కలశ యాత్ర నిర్వహిస్తారు. దీనిలో ప్రధాన ఆకర్షణగా కర్ణాటక రాష్ట్రం నుంచి తీసుకువచ్చిన గజేంద్రుడు (ఏనుగు). ఈ కలశయాత్రలో పాల్గొనేందుకు అద్దంకి, పరిసర గ్రామాల స్త్రీలు భారీగా తరలిరానున్నారు.



భక్తులకు ఏర్పాటు చేసిన క్యూలైన్‌లు

విశేష పూజలు

ఉదయం 8 గంటల నుంచి గురు వందనం, గణపతి పూజ, మండప పూజలు, వేదపారాయణం, సుందరాకాండ పారాయణం, శాంతి హవనములు, పూర్ణాహుతి, జగద్గురువులు శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీస్వామితో యాగశాలలో హోమాలు, విమాన శిఖ కుంభాభిషేకం, యంత్ర స్థాపన, జీవధ్వజ ప్రతిష్ఠ, అనుగ్రహభాషణం, రక్ష కంకణాధారణ, మూల విరాట్‌కు 70 మంది రుత్వికులతో, పంచామృతాలతో అభిషేకంతో పాటు స్వామికి ప్రత్యేక అలంకరణ నిర్వహించనున్నారు.

పలువురు మంత్రులు రాక

అద్దంకి ఎమ్మెల్యే, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్వామికి పట్టు వస్త్ర సమర్పణ చేయనున్నారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పాల్గొనున్నారు.

భారీగా ఏర్పాట్లు

మహా కుంభాభిషేకం కార్యక్రమానికి దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ యం. తిమ్మనాయుడు భారీగా ఏర్పాట్లు చేశారు. ఎండలకు భక్తులు ఇబ్బందులు పడకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. కుంభాభిషేకాన్ని భక్తులు చూసేందుకు భారీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అన్నదానానికి ప్రత్యేక స్టాల్‌లు ఏర్పాటు చేశారు. అన్ని సామాజిక సత్రాల్లో కూడా అన్నవితరణ చేపడతారు. కార్యక్రమ నిర్వహణకు 700 మంది పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

శృంగేరి పీఠాధిపతికి ఘన స్వాగతం



భక్తులకు ఆశీర్వచనాలు అందిస్తున్న స్వామీజీ

కుంభాభిషేకంలో పాల్గొనేందుకు ఆదివారం రాత్రి శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీస్వామి శింగరకొండ విచ్చేశారు. అసిస్టెంట్ కమిషనర్ తిమ్మనాయుడు, దేవస్థాన అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. భక్తులకు స్వామి ఆశీర్వాదాలు అందజేశారు.

పేదల ఆస్పత్రిలో ఫీ'జులుం'!

పెట్ సీటీ స్కానింగ్‌కు యూజర్ చార్జీలు

- ఒక్కో రోగి వద్ద రూ.7వేలు వసూలుకు రంగం సిద్ధం
- హెచ్‌డీఎస్ సమావేశంలో యూజర్ చార్జీలకు ఆమోదం
- క్యాన్సర్ రోగులపై తీవ్ర భారం
- పేదల ఆస్పత్రిలో ఫీజులు పెట్టడంపై తీవ్ర విమర్శలు



ప్రారంభానికి సిద్ధమవుతున్న జీజీహెచ్ క్యాన్సర్ సెంటర్‌లోని పెట్ సీటీ స్కానింగ్ మెషిన్

గుంటూరు మెడికల్: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే ఆధునిక చికిత్సలతో వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. ఏ దశలో ఉంది... శరీరంలో ఏ భాగంలో ఉంది.. ఎంత మేరకు వ్యాప్తి చెందింది.. క్యాన్సర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు పెట్ సీటీ స్కానింగ్ పరీక్ష ద్వారా తెలుసుకోవచ్చు. ఈ పరీక్షను ప్రైవేటు క్యాన్సర్ సెంటర్‌లో చేసినందుకు రోగి వద్ద సుమారు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఫీజు తీసుకుంటున్నారు. ఎంతో ఖరీదైన పెట్‌సీటీ పరీక్షను ఉచితంగా అందించాలనే మంచి ఆశయంతో ప్రభుత్వం సుమారు రూ.18 కోట్ల ఖరీదు చేసే పెట్‌సీటీ మెషిన్‌ను గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు మంజూరు చేసింది. కొద్దిరోజుల్లోనే పెట్‌సీటీ మెషిన్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేలా వేగవంతంగా సివిల్, ఎలక్ట్రికల్, ఇతర పనులు జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ ఆస్పత్రిలో లేనివిధంగా మొట్టమొదటిసారిగా గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో పెట్‌సీటీస్కాన్ వైద్య పరికరం అందుబాటులోకి రావటంతో క్యాన్సర్ రోగులు, ముఖ్యంగా పేద, మధ్య తరగతి రోగులు ఎంతో సంతోషపడ్డారు. గతంలో ఈ పరీక్ష కోసం జీజీహెచ్‌లోని క్యాన్సర్ రోగులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ఇబ్బందులు పడేవారు. వైద్య పరికరం రాకతో సంతోషపడుతున్న తరుణంలో క్యాన్సర్ రోగులకు పిడుగులాంటి వార్త చెవిని పడింది. శనివారం గుంటూరు జీజీహెచ్‌లో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం(హెచ్‌డీఎస్) జరిగింది. జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవతేజ, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, రామాంజనేయులు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ, పలువురు హెచ్‌డీఎస్ సభ్యుల సమక్షంలో పెట్ సీటీ చేసేందుకు సుమారు రూ.7వేలు రుసుంగా తీసుకోవాలని నిర్ణయించారు. ఈ నిర్ణయంపై పలువురు రోగులు, సహాయకులు మండిపడుతున్నారు.

రోగులు, సహాయకుల ఆగ్రహం


నాట్కో ట్రస్ట్ వారు ప్రతి ఏడాది సుమారు రూ.కోటి వ్యయం చేసే మందులు ఉచితంగా జీజీహెచ్‌కు వచ్చే క్యాన్సర్ రోగులకు అందిస్తున్నారు. కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో నేడు ఆస్పత్రిలో ఎంతో మంది దాతలు ముందుకొచ్చి కోట్లాది రూపాయలు విరాళాలు అందిస్తూ ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో క్యాన్సర్ రోగులకు వైద్య పరీక్ష పేరుతో రూ.7వేలు ఫీజు తీసుకోవడం అనేది చాలా మంది జీర్ణించుకోలేకపోతున్నారు. ఒక పక్క ప్రాణాలు తీసే క్యాన్సర్‌తో పోరాటం చేస్తూ చికిత్స పొందుతున్న రోగులు ఆర్థిక ఇబ్బంది పడేలా ఫీజులు పెట్టడంపై విమర్శలు వస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు క్యాన్సర్ రోగుల శ్రేయస్సు దృష్ట్యా వైద్య పరీక్షకు ఫీజు తీసుకోవాలనే విషయమై పునరాలోచించాలని పలువురు రోగులు కోరుతున్నారు.

ఉచిత సేవలు అందించలేరా ?

జిల్లాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, నాట్కో ట్రస్ట్ చైర్మన్ నన్నపనేని వీసీ సుమారు రూ.45 కోట్లతో క్యాన్సర్ రోగులకు కార్పొరేట్ వైద్యసేవలు ఉచితంగా అందించేందుకు నన్నపనేని లోకాదిత్యుడు, సీతారావమ్మ స్మారక నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను నిర్మించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020 జూలై 1న నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. గతంలో కేవలం రేడియేషన్ ఆంకాలజీ వైద్యసేవలు మాత్రమే గుంటూరు జీజీహెచ్‌లో లభించేవి. నాట్కో క్యాన్సర్ సెంటర్ నిర్మించాక మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ వైద్య విభాగాలు రావటంతో పాటుగా వైద్యులు, వైద్య సిబ్బందిని సైతం ప్రభుత్వం నియమించింది. సుమారు రూ.15 కోట్లు ఖరీదు చేసే లీనియర్ యాక్సిలేటర్, రూ.2కోట్లు ఖరీదు చేసే బ్రాకీథెరపీ, రూ.5 కోట్లు ఖరీదు చేసే సీటీ స్టిమ్యూలేటర్ వంటి వైద్య పరికరాలను ప్రభుత్వం నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు ఇచ్చింది. దాంతోపాటుగా పెట్ సీటీ పరికరాన్ని సైతం మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియలో జాప్యం జరిగి ఎట్టకేలకు ఏడాదిన్నర తరువాత పెట్ సీటీ వైద్య పరికరం నేడు నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు వచ్చింది. వైద్య పరికరం వచ్చిందన్న ఆనందం కన్నా వైద్య పరీక్ష చేయించుకునేందుకు రూ.7వేలు చెల్లించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్ణయం తీసుకున్నారనే బాధే నేడు ఎక్కువ మంది రోగుల్లో నెలకొంది.

సందేశాత్మకం.. హాస్యభరితం

ముగిసిన నాటికల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ తేజస్వి

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: మనిషికి ప్రాణంలా, జీవితంలోనూ కళలు అంతే ముఖ్యమని, సంస్కృతి, సంప్రదాయాలకు అవే మూలమని డాక్టర్ చెరుకూరి తేజస్వి చెప్పారు. చిలకలూరిపేట కళాపరిషత్, సీఆర్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఉభయ తెలుగురాష్ట్రాల స్థాయి 9వ ఆహ్వాన మూడోరోజు పోటీలను ఆదివారం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్థానిక సీఆర్‌క్లబ్ ఆవరణలో స్వర్గీయ నాగభైరు సుబ్బారావు కళా ప్రాంగణంలో మూడోరోజు ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. శనివారం రాత్రి భారీవర్షం కారణంగా చివరి ప్రదర్శన దొందు–దొందే నాటిక నిలిచిపోగా, దాన్ని మరుసటి రోజు తొలి ప్రదర్శనగా వేశారు. దీంతో ముగింపురోజు నాలుగు ప్రదర్శనలు అయ్యాయి. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు చెరుకూరి కాంతయ్య, క్లబ్ కోశాధికారి మక్కెన నరసింహారావు, ప్రజానాట్యమండలి నాయకుడు నూతలపాటి కాళిదాసు, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి ఏవీ శివయ్య, ఆళ్ల హరిబాబు, కొత్త శివ, కేవీ మంగారావు, సత్యానందం, ఉమర్ పాల్గొన్నారు.

నవ్వించిన 'దొందూ–దొందే'

లోపం లేని వాడు లోకంలోనే లేడని మనలోని లోపాల్ని కాదు ప్రేమను పంచినపుడే జీవితం సంతోషంగా ఉంటుందని చాటింది భద్రం ఫౌండేషన్ విశాఖపట్నం వారి 'దొందు–దొందే' నాటిక. భారీ పొట్టతో 40 ఏళ్లుదాటినా సంబంధాలు రాని ఓ యువకుడు తన లోపాన్ని పెళ్లికి ముందే భాగస్వామికి తెలియజేయాలని కుటుంబ సభ్యులతో చెబుతాడు. రేచీకటి ఉన్న యువతితో అసలు విషయం చెప్పకుండా పెద్దలు వైభవంగా వివాహం చేస్తారు. తొలిరాత్రి నాడు విషయం బహిర్గతం కావడంతో నూతన దంపతులు మధ్య మనస్పర్థలు ఏర్పడి విడాకుల కావాలంటారు. ఇరు కుటుంబాల్లో గందరగోళం మొదలవుతుంది. మనిషిలోని లోపాల్ని బలహీనతలుగా కాక, సహనం, ప్రేమతో చూసినప్పుడే జీవితాన్ని సాఫీగా ముందుకు సాగించడం సాధ్యమవుతుందని పెద్దలు తెలిపే సందేశంతో నాటిక ముగుస్తుంది. స్వీయరచనకు డేవిడ్‌రాజు దర్శకత్వం వహించారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రోసూరు: స్థానిక జెడ్పీ పాఠశాల ఆవరణలో వైఎంసీఏ యూత్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఓపెన్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను కంచేటి సాయిబాబు ఆదివారం ప్రారంభించారు. మొత్తం 40 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు అఖిల్ తెలిపారు. సాయిబాబు మాట్లాడుతూ క్రీడల వల్ల యువతకు ఆరోగ్యంతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని చెప్పారు. పోటీలలో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతిగా రూ.50,116, ద్వితీయ బహుమతిగా రూ.25,116, మూడో బహుమతిగా రూ.10,116, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు రూ.5,116 అందించనున్నట్లు వెల్లడించారు. బెస్ట్ బ్యాట్స్‌మన్‌కు రూ.2,116, బెస్ట్ బౌలర్‌కు రూ.2,116 అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దిగుమర్తి అప్పారావు, మన్నెం శ్రీను, వెంకటరామిరెడ్డి, బండారు రాము, కంభంపాటి రాము, బాబు పాల్గొన్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్

- రాంగ్ రూట్‌లో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన బొలెరో
- వ్యక్తి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు



తాడేపల్లి రూరల్: పూటుగా మద్యం తాగి కారును విచక్షణారహితంగా నడపడంతో వృద్ధుడు మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలైన ఘటన తాడేపల్లి రూరల్ పరిధిలోని అమరావతి రోడ్డులో పెనుమాక–ఉండవల్లి మధ్య ఆదివారం రాత్రి జరిగింది. సేకరించిన సమాచారం ప్రకారం.. మద్యం మత్తులో ఉన్న నరేష్ అనే వ్యక్తి బొలెరో వాహనంలో పెనుమాక నుంచి ఉండవల్లి వెళుతున్నాడు. ఈక్రమంలో ఉండవల్లి సెంటర్ నుంచి పెనుమాక వెళ్తున్న బ్రహ్మయ్య (60) ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో బ్రహ్మయ్యతో పాటు వాహనంపై ఉన్న మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వీరి వెనుక ఉన్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో అతనికీ గాయాలయ్యాయి. బొలెరో వాహనం రెండు వాహనాలను ఢీకొట్టడంతో వాటి పై ప్రయాణిస్తున్న ముగ్గురు గాలిలోకి ఎగిరి రోడ్డు మీద పడ్డారు. అనంతరం బొలెరో వాహనం రోడ్డు పక్కన ఉన్న కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో బ్రహ్మయ్యతో పాటు గాయపడ్డ ముగ్గురిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో బ్రహ్మయ్య మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన మద్యం మత్తులో వున్న నరేష్‌ను తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

హెచ్ఐవీ,ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం

డీఎంఅండ్‌హెచ్ఓ విజయమ్మ



కొవ్వొత్తుల ప్రదర్శన ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టరు విజయమ్మ , వైద్య సిబ్బంది

బాపట్ల: హెచ్ఐవీ, ఎయిడ్స్ రహిత సమాజాన్ని భావితరాలకు అందించాలని డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టరు విజయమ్మ చెప్పారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో 42వ అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిలైట్ మెమోరియల్ డే -2025 కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. మహిళలు క్యాండిల్ ప్రదర్శన చేపట్టారు. డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులకు భరోసా కల్పించేందుకు ఈ ప్రదర్శన దోహద పడుతుందని తెలిపారు.హెచ్ఐవీ,ఎయిడ్స్ పరీక్షలను ప్రభుత్వం ఉచితంగా చేపడుతోందని తెలిపారు. వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపరాదని సూచించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి షేక్ మొహమ్మద్ సాదిక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఐసీ పాలసీలపై జీఎస్టీని తీసి వేయాలి

- ఏజెంట్ల యూనియన్ లియాఫీ డివిజన్ అధ్యక్షుడు నిమ్మగడ్డ
- పాలసీదారులకు బోనస్ పెంచాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సత్తెనపల్లి: పాలసీలపై జీఎస్టీ తీసి వేయాలని, పాలసీదారులకు బోనస్‌ను పెంచాలని ఎల్ఐసీ ఏజెంట్ల యూనియన్ లియాఫీ డివిజన్ అధ్యక్షుడు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు కోరారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో గల మాడా విశ్వేశ్వరరావు ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన లియాఫీ ఏజెంట్ల యూనియన్ మచిలీపట్నం డివిజన్ స్థాయి సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. పాలసీదారులకు లోన్‌పై వడ్డీ రేటు తగ్గించాలని, ఏజెంట్లు అందరికీ మెడి క్లెమ్‌ను కుటుంబ సమేతంగా కల్పించాలని కోరారు. గ్రూప్ ఇన్సూ్యరెన్స్ ఏజెంట్‌గా పని చేస్తున్నంత కాలం కలిపించాలని డిమాండ్ చేశారు. సమాజంలో దిగువ తరగతి వారికి రూ. లక్ష పాలసీ ప్రవేశ పెట్టాలని మేనేజ్‌మెంట్‌ను ఆయన కోరారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సత్తెనపల్లి బ్రాంచి అధ్యక్షుడు మంచాల రమేష్ మాట్లాడుతూ ఎల్ఐసీ ఏజెంట్లు దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుకొమ్మలు అని, ఎల్ఐసీని బలోపేతం చేయడంలో కీలకమని తెలిపారు. ఏజెంట్లు అభివృద్ధికి సంస్థ కృషి చేయాలని కోరారు. సమావేశంలో డివిజన్ నాయకులు రవీంద్రరెడ్డి, అలిమియా, జగన్నాథం, రఘు, శ్రీనివాసరెడ్డి, మారుతి, సత్తెనపల్లి బ్రాంచి ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ నందిగం సురేష్ అరెస్టు హేయం



సత్తెనపల్లి:బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ అరెస్టు హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు చిలుకా జయపాల్ ఆదివారం ఖండించారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తప్పుడు కేసులతో దళిత నాయకుడు, మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పలు రకాలుగా వేధింపులకు గురి చేస్తోందని విమర్శించారు. ఇప్పటికే ఒకసారి అరెస్ట్ చేశారని, అది చాలదన్నట్లు ఇప్పుడు తాజాగా టీడీపీ కార్యకర్త తప్పుడు ఫిర్యాదుతో మరోసారి అరెస్ట్ చేశారని తెలిపారు. సురేష్ ఇంటి వద్ద రాజు అనే టీడీపీ కార్యకర్త హల్‌చల్ చేసి కుటుంబ సభ్యులను అసభ్యకరంగా దూషించాడని, కార్లను ధ్వంసం చేసి వీరంగం సృష్టించినా కనీసం పోలీసులు పట్టించుకోలేదని విమర్శించారు. కానీ హల్‌చల్ చేసిన టీడీపీ కార్యకర్త రాజు ఇచ్చిన ఫిర్యాదుతో సురేష్‌ను అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. టీడీపీకో న్యాయం.. వైఎస్సార్ సీపీకో న్యాయమా? అని ప్రశ్నించారు. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రహించాలని జయపాల్ పేర్కొన్నారు. ఇదేనా ప్రజాస్వామ్యం? ఇదేనా మీరు దళితుల పైన చూపిస్తున్న ప్రేమ ? అంటూ మండిపడ్డారు. ఇప్పటికైనా అక్రమ అరెస్ట్‌లు మానుకోకపోతే ప్రజలే భవిష్యత్తులో తగిన రీతిలో బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

గుంటూరులో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు



లక్ష్మీపురం: ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర మహాసభలు గుంటూరులో జులై 23, 24 తేదీల్లో నిర్వహించనునట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ నరసింహారావు చెప్పారు. పాత గుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం బి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇదే విధంగా వ్యవహరిస్తే ప్రత్యక్ష కార్యాచరణకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. గుంటూరులో జరుగుతున్న రాష్ట్ర మహాసభకు మేస్త్రీలు, బిల్డర్స్, కాంట్రాక్టర్స్ సహాయ సహకారాలు అందించాలని కోరారు. యూనియన్ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భవన నిర్మాణాలకు ఆటంకంగా ఉన్న, లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ ఉద్యోగ భద్రతకు ప్రమాదకరంగా ఉన్న జీవో నంబర్ 20ని రద్దు చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి. లక్ష్మణరావు, నాయకులు కె. శ్రీనివాసరావు, బి. ముత్యాలు, పి. దీవెన రావు, బాబూరావు, డి కోటేశ్వరరావు, ఖాసీం వలి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బదిలీల నుంచి మినహాయించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: 60 ఏళ్ల వయసుకు చేరువలో ఉన్న ఉపాధ్యాయులను బదిలీల నుంచి మినహాయించాలని వైఎస్సార్ సీపీ ఉద్యోగ, పెన్షనర్ల విభాగ గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. 2017 ఆగస్టులో జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో స్థాన చలనం పొందిన వారిని ప్రస్తుత బదిలీల్లో లాంగ్ స్టాండింగ్ విభాగంలో ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి కాకుండా, అకడమిక్ ఇయర్స్ ప్రాతిపదికగా మే 31 నాటికి లాంగ్ స్టాండింగ్‌గా పరిగణించి బదిలీల్లో చేర్చుతున్నారని తెలిపారు. కేలండర్ ఇయర్స్ కాకుండా విద్యా సంవత్సరాల ప్రాతిపదికన బదిలీలు నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన దృష్ట్యా 60 ఏళ్ల వయసు పైబడిన ఉపాధ్యాయులు సైతం బదిలీల్లో స్థాన చలనం పొందనున్నారని, ఇది వారికి తీవ్ర అన్యాయం కలిగించే విషయమన్నారు. ఒక అకడమిక్ ఇయర్‌లో 9 నెలలు పనిచేస్తే ఒక ఏడాదిగా పరిగణిస్తున్న విద్యాశాఖాధికారులు, 59 ఏళ్ల 10 నెలలు వయస్సు నిండిన వారిని 60 ఏళ్ల వయసు నిండిన వారితో సమానంగా పరిగణించకపోవడంతో అనేకమంది ఉపాధ్యాయులు మానసికంగా ఆవేదన చెందుతున్నారని అన్నారు. 60 ఏళ్లకు చేరువలో ఉన్న వయోధిక ఉపాధ్యాయుల వయసు, అనారోగ్య సమస్యలను పరిగణలోకి తీసుకుని వారిని బదిలీల నుంచి మినహాయించాలని కోరారు. ప్రభుత్వం, విద్యాశాఖాధికారులు వారి పట్ల మానవత్వంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంద్రకీలాద్రిపై భక్తజన సందడి



క్యూలైన్లో అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో కొలువై ఉన్న ఆదిదంపతుల దర్శనానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు, యాత్రికులు తరలివచ్చారు. ఆదివారం తెల్లవారు జాము నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగింది. మరో వైపున తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో మూలవిరాట్ వద్ద జరిగిన ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమం, గణపతి హోమంలో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. లోక కల్యాణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన సేవ చేశారు. అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గంలో కొండపైకి చేరుకున్నారు. సర్వ దర్శనం, రూ.100, రూ. 300, రూ.500 టికెట్లను కొనుగోలు చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం భక్తులకు దేవస్థానం ఉచిత ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాలను అందించింది. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించడానికి అరగంట అన్ని దర్శనాలు నిలిపివేశారు. వీఐపీలు, సిఫార్సులపై వచ్చే భక్తులకు సైతం క్యూలైన్‌లోనే దర్శనానికి అనుమతించారు. సాయంత్రం అమ్మవారికి జరిగిన పంచహారతుల సేవలోనూ భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

విద్యుత్ పోల్ పైనుంచి పడి షిఫ్ట్ ఆపరేటర్ మృతి

నరసరావుపేట రూరల్: మండలంలోని ఉప్పలపాడు కరెంట్ ఆఫీస్‌లో షిఫ్ట్ ఆపరేటర్ పనిచేస్తున్న రఫీ కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. పోల్ మీద పనిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. పోల్ పైనుంచి కింద రాయిమీద పడటంతో తీవ్ర గాయాలతో మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం దుకాణంలో ఆభరణాల చోరీ

- అసలు స్థానంలో నకిలీ వస్తువులు పెట్టి పరారీ
- సీసీ ఫుటేజ్ ద్వారా ముగ్గురు మహిళల గుర్తింపు
- దుకాణ యజమాని ఫిర్యాదుతో కేసు నమోదు

నరసరావుపేటటౌన్ : బంగారు వస్తువుల కొనుగోలుకు వచ్చిన మహిళలు నకిలీవి పెట్టి అసలైన బంగారం దొంగిలించిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి చరణ్ ఆదివారం తెలిపారు. పట్టణంలోని శివుడి బొమ్మ సెంటర్లో గల శ్రీ శారద జ్యూయలర్స్ దుకాణంలోకి శనివారం ముగ్గురు మహిళలు వచ్చారు. బంగారు చెవి కమ్మలు కావాలని అడిగారు. అవి చూస్తూనే దుకాణ సిబ్బందిని మాటల్లో పెట్టి వారి వెంట తెచ్చుకున్న నకిలీ కమ్మలను అక్కడ పెట్టి అసలైన వాటిని అపహరించారు. సరిపడా డబ్బులు లేవని రేపు వచ్చి తీసుకు వెళ్తామని చెప్పి వెళ్లిపోయారు. బంగారం వస్తువుల తూకంలో వ్యత్యాసం రావడంతో అనుమానం వచ్చిన దుకాణ గుమస్తా యజమాని దృష్టికి తీసుకెళ్లారు. సీసీ ఫుటేజ్ పరిశీలించగా, ముగ్గురు మహిళలు నంబర్ ప్లేట్ లేని ఆటోలో వచ్చి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు దుకాణ యజమాని కపిలవాయి విజయ్ కుమార్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. చోరీకి గురైన సొత్తు విలువ రూ. 1.30 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు

ఆల్ ఔట్ రీఫిల్ ప్యాక్ నోటిలో పెట్టుకున్న బాలుడు మృతి

చిలకలూరిపేట టౌన్: ఆడుకుంటూ ఆల్‌ఔట్ రీఫిల్ ప్యాక్‌ను నోటిలో పెట్టుకున్న బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఉత్తర్‌ప్రదేశ్ నుంచి ఉపాధి పనుల నిమిత్తం చిలకలూరిపేట పట్టణానికి మూడు నెలల కిందట భానుప్రతాప్‌సింగ్, లాలీదేవి దంపతులు తమ ముగ్గురు సంతానంతో వచ్చారు. స్థానిక రెడ్ల బజారులో అద్దె ఇంట్లో ఉంటూ మోర్ సమీపంలో ట్యాటూస్ షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 14వ తేదీన లాలీదేవి ఇంట్లో స్నానానికి వెళ్లింది. ఈ సమయంలో ఆడుకుంటున్న రెండేళ్ల నాలుగు నెలల రెండో కుమారుడు దీపక్ కింగ్ పొరపాటుగా ఆల్‌ఔట్‌ను నోటిలో పెట్టుకున్నాడు. స్నానం ముగించి వచ్చిన తల్లి దీపక్ నోటి నుంచి నురగ రావడం గమనించి ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో చికిత్స పొందుతూ దీపక్ ఆదివారం మృతి చెందాడు.

కబడ్డీ అసోసియేషన్ పల్నాడు జిల్లా ప్రెసిడెంట్‌గా మాబు హుస్సేన్



సత్తెనపల్లి: కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్‌గా షేక్ మాబు హుస్సేన్ ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ పల్నాడు జిల్లా సమావేశం శనివారం తాడేపల్లిలో నిర్వహించారు. ఇందులో సత్తెనపల్లికి చెందిన అంజి మెమోరియల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ షేక్ మాబు హుస్సేన్‌ను పల్నాడు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ కాసాని వీరేష్ హాజరయ్యారు. ఎంపికైన వారికి పత్రాలు అందజేశారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్‌గా ఎన్నికైన షేక్ మాబు హుస్సేన్‌ను ఆదివారం పలువురు అభినందించారు.

తెలుగు పలుకుబడులకు చిరునామా చేరెడ్డి

పుట్టంరాజు సాహిత్య పురస్కారం అందజేత



చేరెడ్డి మస్తాన్‌రెడ్డిని సన్మానిస్తున్న శ్రీరామచంద్రమూర్తి దంపతులు

అద్దంకి: తెలుగు పలుకుబడులు, పదబంధాల విన్యాసం చేరెడ్డి మస్తాన్‌రెడ్డి కవిత్వంలో కనిపిస్తాయమని సాహిత్యవేత్త గాడేపల్లి దివాకరదత్తు అన్నారు. సాహితీ కౌముది ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డికి పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ పక్షాన పుట్టంరాజు కళాక్షేత్రంలో 2025 సాహిత్య పురస్కారాన్ని అందజేశారు. ఈ సభకు గాడేపల్లి దివాకర దత్తు అధ్యక్షత వహించారు. దేవపాలన మాట్లాడుతూ చేరెడ్డి రచనలు ప్రాచీన కావ్యాలను తలపిస్తుంటాయని అభినందించారు. పోలూరి వెంకట శివరామ ప్రసాద్ మాట్లాడుతూ సంప్రదాయ పద్య సాహిత్యానికి చేరెడ్డి గౌరవాన్ని చేకూర్చారని చెప్పారు. పద్య కవులను ప్రోత్సహించడంలో చేరెడ్డి పాత్ర గొప్పదని వివరించారు. పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి 'మహాభారతం.. కవిత్రయ శైలి' అనేది గొప్ప పరిశోధన అని శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం అన్నారు. అనంతరం చేరెడ్డి మస్తాన్‌రెడ్డికి సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. పురస్కారం కింద రూ.5వేలు, పట్టుబట్టలు, సన్మాన పత్రం, జ్ఞాపకను అందజేశారు. కార్యక్రమంలో వారణాశి రఘురామశర్మ, చుండూరి మురళీ సుధాకర్‌రావు, కడియం పాపారావు, కె. సుబ్బారావు, నిమ్మరాజు నాగేశ్వరరావు, కొండకావూరి కుమార్, ఆర్. రాజశేఖర్, కూరపాటి రామకోటేశ్వరరావు, సాహిత్యవేత్తలు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

ఒంగోలు జాతి ఎడ్ల పూటీ లాగుడు పోటీలు ప్రారంభం



క్రాపంలో నిర్వహిస్తున్న పూటి లాగుడు పోటీలు

కొల్లూరు : రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల పూటీ లాగుడు పోటీలు మండలంలోని క్రాపలో ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు జూనియర్ విభాగంలో 10 నిమిషాల వ్యవధిలో పోటీలను నిర్వహించారు. సోమవారం సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించనున్నారు. నియోజకవర్గ స్థాయిలోని ఐదు మండలాలలో ఇప్పటి వరకు బండ, బండి లాగుడు పోటీల్లో పాల్గొనని టైరు బండి ఎద్దులకు మాత్రం మంగళవారం పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. రాష్ట్రస్థాయి జూనియర్, సీనియర్ విభాగాలలో ప్రథమ బహుమతి నుంచి 8వ స్థానం వరకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. నియోజకవర్గ స్థాయి టైరు బండి విభాగంలో ఆరు స్థానాల్లో నిలిచిన ఎడ్లకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థిపై దాడి అమానుషం

రాష్ట్ర వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి బిల్లాలి దేవిడ్



పర్చూరు(చినగంజాం): తిరుపతి జిల్లాలో అనుపల్లి జేమ్స్ అనే విద్యార్థిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి బిల్లాలి డేవిడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జేమ్స్‌ను దళితుడని ఇబ్బందులకు గురిచేసిన యశ్వంత్ నాయుడుతోపాటు అతనిపై దాడికి పాల్పడిన రౌడీషీటర్ రూపేష్, చోటా బ్లేడ్, జగ్గా కిరణ్‌లను కఠినంగా శిక్షించాలని కోరారు. తిరుపతి విద్యానికేతన్ కాలేజీలో చివరిస సంవత్సరం చదువుతున్న జేమ్స్‌ను అతని కంటే ఒక సంవత్సరం జూనియర్ అయిన యశ్వంత్ నాయుడు హేళన చేశాడన్నారు. దళితుడని, ఒరేయ్ అంబేడ్కర్ అని రకరకాలుగా మాటలతో హింసిస్తుండగా.. జేమ్స్ ఖండించాడని తెలిపారు. మరొక సారి ఇదే విధంగా మాట్లాడితే ఊరుకోబోనని హెచ్చరించాడన్నారు. దీనినిపై పగ పెంచుకున్న యశ్వంత్ నాయుడు అతనిపై దాడి చేసి హింసించి నానా విధాలుగా పరుష పదజాలంతో తిట్టడంతో పాటు, కాళ్ళు చేతులు కట్టి వేసి కత్తితో హత్యాయత్నం చేశారని.. వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తనపై దాడి చేసిన వారిపై కేసు పెట్టేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళితే కేసును తీసుకోకుండా మధ్యవర్తిత్వం చేసేందుకు ప్రయత్నించారని, రక్షణ కల్పించాల్సిన పోలీసులు వ్యవస్థలను పాడు చేస్తుంటే ప్రభుత్వం ఏమీ చేస్తుందని ఆయన ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ముస్లిం మైనార్టీల కోసం పనిచేసే నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఇటువంటి వ్యక్తుల భరతం పడతారని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, హత్యాయత్నం కేసు, కిడ్నాప్‌కేసు, పరువు నష్టం కేసు సెక్షన్‌లు అమలు చేస్తూ కేసు నమోదు చేసి జేమ్స్‌కు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో పసుపులేటి సురేష్, జిమ్‌రాజు తదితరులు

సత్తెనపల్లి: స్థానిక పవర్ హౌస్ ఫిట్‌నెస్‌లో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు పల్నాడు జిల్లా నుంచి జట్టు ఎంపిక ఆదివారం నిర్వహించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని డీఆర్‌పీ ఆనంద్ స్టేడియంలో ఈ నెల 31 నుంచి 2 జూన్ వరకు రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ – బెంచ్ ప్రెస్ సబ్ జూనియర్, జూనియర్, మాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ ఎక్విప్డ్ పోటీలు జరుగుతాయి.కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ పల్నాడు జిల్లా సెక్రటరీ పసుపులేటి సురేష్, ప్రెసిడెంట్ జిమ్ రాజు, జి.రమేష్, కత్తి పవన్‌కుమార్, ఎం.రాహుల్‌గౌతమ్, సయ్యద్ మస్తాన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, శాంతయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పసుపులేటి సురేష్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో పతకాలను సాధించి పల్నాడు జిల్లాకు మంచి పేరు తేవాలని ఆయన ఆకాంక్షించారు.

ఎంపికైన జట్ల వివరాలు ఇలా..

సబ్ జూనియర్: 43 కేజీలు కత్తి పల్లవి (గురజాల), 53 కేజీలు కె.కార్తిక్ (గురజాల), 66 కేజీలు ఎం.వినయ్ వెంకట శివ(సత్తెనపల్లి) జూనియర్ విభాగం: 53 కేజీలు ఎం.సాయి గగన్ (సత్తెనపల్లి),74 కేజీలు ఎస్. శరత్(కంకణాలపల్లి), 74 కేజీలు పి.శ్రీహర్ష రమేష్ చౌదరి (కంకణాలపల్లి), 83 కేజీలు పసుపులేటి వంశీ కృష్ణ (సత్తెనపల్లి),120 కేజీలు ఎల్. శివనాగేశ్వరరావు(గుడిపూడి) ఎంపికయ్యారు.

ప్రజల శాంతికి ఆటంకం కలిగిస్తే చర్యలు

పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు



నరసరావుపేట రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు



నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల బ్యాగ్‌లు తనిఖీ

నరసరావుపేట: జిల్లాలో ప్రజల శాంతికి ఆటంకం కలిగించినా, మద్యం తాగి వాహనాలు నడిపినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు హెచ్చరించారు. రైల్వేస్టేషన్, బస్టాండ్లలో ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అసాంఘిక శక్తులు దాగి ఉండే ప్రదేశాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. పల్నాడు జిల్లావ్యాప్తంగా ఆదివారం పోలీసులు బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, లాడ్జీలు, వాహనాలు, నగర శివారు ప్రాంతాలు, ప్రధాన రహదారులపై విస్తృత తనిఖీలు చేశారు. బీడీ టీమ్, డాగ్ స్క్వాడ్‌లు కూడా పాల్గొన్నాయి. లాడ్జీల్లో పోలీసులు ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బస చేసిన వ్యక్తులను ప్రశ్నించి, వివరాలు ఆరా తీశారు. రిజిస్టర్లను పరిశీలించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని లాడ్జీల నిర్వాహకులకు సూచించారు. లాడ్జి పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను తనిఖీచేసి వారి గుర్తింపు వివరాలను నమోదు చేశారు. ఖాళీ ప్రదేశాలు, శివారు నగర ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై దాడులు నిర్వహించారు. అనంతరం వాహన తనిఖీలు చేపట్టారు. రహదారి భద్రత నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులపై కేసులు నమోదు చేశారు.

విద్యార్థి అదృశ్యం

మూడు రోజులుగా లభించని ఆచూకీ



మీనిగ సామ్యేల్ ప్రణీత్ (ఫైల్)

కారంచేడు: కారంచేడు పాలేటివారి బజారుకు చెందిన ఓ విద్యార్థి ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. ఎప్పుడూ ఇల్లు కదలని అతడు అదృశ్యం కావడంపై పలు అనుమానాలకు తావిస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామానికి చెందిన మీనిగ జయప్రకాష్‌కు ఇద్దరు కుమారులు. రెండో కుమారుడు సామ్యేల్ ప్రణీత్ చీరాల లోని ఒక ప్రైవేటు స్కూల్‌లో 9వ తరగతి పూర్తి చేశాడు. వేసవి సెలవుల్లో ఇంటి వద్దనే ఉంటున్న బాలుడు ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం 2గంటల నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు తెలిపారు. మూడు రోజులుగా బంధువులు, స్నేహితుల వద్ద విచారించామని చెబుతున్నారు. ఆదివారం సామ్యేల్ వాడుతున్న సైకిల్ పర్చూరు గ్రామంలోని ఉప్పుటూరు వంతెన వద్ద స్టాండ్ వేసి ఉండటం గమనించామని పేర్కొన్నారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని.. ఆచూకీ తెలిసిన వారు 9515640934, 9542618260 నంబర్లకు తెలియజేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.